క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

శావల్యాపురం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.కవితాచౌదరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశానికి ఎంపీపీ ముండ్లమూరి సహాసిని అనిల్‌కుమార్ అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. సాధారణ సమీక్ష మాత్రమే జరుగుతుందన్నారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మండల గ్రామ స్థాయి అధికారులు అందరు తప్పనిసరిగా పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

నాదెండ్ల: తెలంగాణ నారాయణపేట జిల్లా మత్కల్ ఇరిగేషన్ ఏఈగా పనిచేస్తున్న ఐనవోలు నాగశివ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం గణపవరంలోని తులసీవనం వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులు, పేదలకు రెండు పూటలా భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అద్దంకి మున్సిపల్ మేనేజర్ బి.శ్రీదేవి, కాట్రు శ్రీనివాసరావు, ఐనవోలు షాన్విత్ పాల్గొన్నారు.

92 శాతం పెన్షన్ల పంపిణీ



నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో వైఎస్సార్ పెన్షన్ కానుక – సామాజిక భద్రతా పెన్షన్లు ఆదివారం సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. మండల పరిధిలో 9,659 మంది లబ్ధిదారులకు గాను రూ.2,86,49,000 పెన్షన్ పంపిణీ చేయాల్సి ఉండగా, ఇందులో 2,440 మందికి గాను పెన్షన్ నగదును వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన 7,219 మందికి సచివాలయ సిబ్బంది శనివారం నుంచి పంపిణీ చేస్తున్నారు. సుమారు 92 శాతం పైగా పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఆదివారం బ్యాంకులకు సెలవు దినం కావటంతో సోమవారం నుంచి 5వ తేదీ వరకూ పెన్షన్ సొమ్మును ఖాతాల నుంచి డ్రా చేసుకోవచ్చని తెలిపారు.

కంకర రాళ్లు, కర్రలు లేకుండా చర్యలు తీసుకోవాలి



నరసరావుపేట రూరల్: గ్రామాల్లో బహిరంగ ప్రాంతాల్లో కంకరరాళ్లు, కర్రలు లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఈఓపీఆర్డీ కేవీ ప్రసాద్ సూచించారు. మండలంలోని పెట్లూరివారిపాలెంలో ఆదివారం పర్యటించారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రదేశాలను సందర్శించి గృహ యజమానులకు పలు సూచనలు చేశారు. గృహ నిర్మాణాల వద్ద కంకరరాళ్లు, కర్రలు అందుబాటులో లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏమైన ఘర్షణలు జరిగితే సంబంధిత గృహ యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కంకర రాళ్లు, కర్రలు రోడ్ల వెంట లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

విశేష అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి



పిడుగురాళ్ల: హనుమజ్జయంతి పురస్కరించుకొని పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద వేంచేసియున్న ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రసన్నాంజనేయస్వామికి ఆలయ పూజారులు విశేష అలంకరణ నిర్వహించారు. భక్తులు విశేషంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలను అందించారు.

విశేష పుష్పాలంకరణలో భక్తాంజనేయస్వామి



సత్తెనపల్లి: పట్టణంలోని మహా రాష్ట్ర వీధిలో గల శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో మూడవ రోజు ఆదివారం హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి పూలంగి సేవ చేశారు. భక్త సంగీత కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

ఏఎస్పీ రమణమూర్తి



యడ్లపాడు హైవే సర్వీస్ మార్గంలోని దుకాణాలు మూసివేసిన దృశ్యం

నాదెండ్ల: ఎన్నికల ఫలితాల వెలువడనున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ, చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమణమూర్తి హెచ్చరించారు. నాదెండ్ల పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు, పలువురికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉదయం 7 గంటలకు పోలీస్ స్టేషన్‌కు హాజరుకావాలని, తిరిగి రాత్రి తమ అనుమతితో రిజిస్ట్రార్‌లో సంతకాలు పెట్టి వెళ్లాలన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకూ పోలీసుల ఆంక్షలను పాటించాలని కోరారు. కవ్వింపు చర్యలు, అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఏ రాజకీయ పార్టీ గెలుపొందినా ప్రజలు సంయమనంతో వ్యవహరించాలన్నారు. ఊరేగింపులు, బాణసంచా కాల్చటం నిషేధమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఐ సుబ్బారావు, ఎస్ఐ జె.బలరామ్‌రెడ్డి ఉన్నారు.

చందవరంలో కార్డన్ సెర్చ్...

సమస్యాత్మక గ్రామమైన చందవరంలో పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. బొడ్డురాయి సెంటర్‌లో ఇన్‌చార్జి సీఐ సుబ్బారావు మాట్లాడుతూ, గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టామన్నారు. అనంతరం సరైన పత్రాలు వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

గొడవలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

శావల్యాపురం: సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు సందర్భంగా గొడవలు, అల్లర్లుకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆక్టోపస్ డీఎస్పీ తిరుపతయ్య హెచ్చరించారు. ఆదివారం మండలంలోని కొత్తలూరు, తుమ్మలకుంట గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందని చెప్పారు. తద్వారా ఓట్లు లెక్కింపు పురస్కరించుకొని శాంతి భద్రతలు విఘాతం కలుగకుండా ఉండటానికి వ్యాపార సంస్థలు మూతవేయటంతో పాటు ప్రతి ఒక్కరూ పోలీసులకు తమ వంతు సహకరించాలన్నారు. అత్యవసర సర్వీసులు మినహాయించి మిగిలిన వ్యాపార సముదాయాలన్నీ పూర్తి స్థాయిలో మూసి వేయాలన్నారు. రోడ్లపై ప్రజలు గుంపులుగా ఉండరాదన్నారు. ఓట్లు లెక్కింపు ప్రక్రియ పూర్తి కాగానే బాణసంచా కాల్చరాదన్నారు. సోషల్ మీడియాలో రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చ గొట్టే విధంగా వీడియోలు, ఫొటోలు, సందేశాలు పోస్టులు చేసిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఐలు ఉప్పుటూరి సుధాకరరావు, హాజరత్తయ్య, శ్రీనివాసరావు, ఎస్ఐలు చల్లా సురేష్, లక్ష్మీనారాయణరెడ్డి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పకడ్బందీగా 144 సెక్షన్ అమలు

నాదెండ్ల: ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆదివారం నుంచి పోలీసులు 144 పకడ్బందీగా అమలు పరుస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వచ్ఛందంగా షాపులు మూసివేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వాహనాలను పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ నెల 5 వరకూ మండలంలోని ప్రతి గ్రామంలో ఇదే విధంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అత్యవసరమైన మెడికల్ షాపులు, పాలబూత్‌లు తెరిచి ఉంటాయని పేర్కొన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆంక్షలు పక్కాగా అమలు చేయనున్నట్లు ఎస్ఐ జె.బాలరామ్‌రెడ్డి తెలిపారు.



తుమ్మలకుంట గ్రామంలో మాట్లాడుతున్న డీఎస్పీ తిరుపతయ్య



గణపవరంలో హైవేపై వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ బలరామ్‌రెడ్డి

వినుకొండలో..

వినుకొండ(నూజెండ్ల): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 4వ తేదీన జరిగే కౌంటింగ్‌కు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వినుకొండలో పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. ఉదయం నుంచే దుకాణాలు, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. పోలీసులు ప్రధానసెంటర్‌లో బందోబస్తు నిర్వహించారు. శివయ్య స్థూపం సెంటర్, ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు పలు సెంటర్లల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ సాంబశివరావు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 5వ తేదీ వరకు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎక్కడైనా అల్లర్లు, గొడవలు సృష్టించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని, నలుగురు కంటే ఎక్కువగా గుమికూడి ఉండవద్దని, అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రొంపిచర్ల మండలంలో..

రొంపిచర్ల: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా శాంతిభద్రతల నిమిత్తం మండలంలో 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమైన 144 సెక్షన్ ఆదివారం కూడా కొనసాగింది. మండల కేంద్రమైన రొంపిచర్లలోని ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. షాపులు, దుకాణాలు మూసివేశారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో లౌడ్ స్పీకర్లతో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ నెల 4వ తేదీన కౌంటింగ్ నిర్వహిస్తుండటంతో 5వ తేదీ సాయంత్రం వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ఐ కె.పి.రవీంద్ర తెలిపారు. నలుగురు ఒక చోట గుమి కూడవద్దని హెచ్చరిస్తున్నారు. పోలీస్ వారి ఆంక్షలను ఉల్లగింస్తే వారిపై కేసులు నమోదు చేసి శిక్షిస్తామని ప్రచారం చేస్తున్నారు.



నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అడిషనల్ ఎస్పీ రమణమూర్తి

అంతటా ప్రశాంతం...

యడ్లపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో 144వ సెక్షన్‌ను పోలీసులు కఠినంగా అమలు చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి వివాదాలు, ఘర్షణలు చోటు చేసుకోకుండా రెండు రోజుల ముందుగానే పోలీసులు మండల కేంద్రమైన యడ్లపాడుతో పాటు గ్రామాల్లోనూ మైకు ప్రచారం నిర్వహించి హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం శనివారం రాత్రి నుంచి పూర్తిస్థాయిలో అన్ని వ్యాపార, సేవ పరిధిలోకి వచ్చే దుకాణాలను సైతం మూసివేయించారు. నిత్యం రద్దీగా ఉండే యడ్లపాడు, బోయపాలెం ప్రధాన సెంటర్లు బోసి పోయాయి. సీఐ శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో ఎస్ఐ జె.శామ్యూల్ రాజీవ్‌కుమార్ సిబ్బందితో కలసి అన్ని గ్రామాల్లోనూ ఆకస్మికంగా గస్తీ నిర్వహిస్తూ 144 సెక్షన్‌ను గట్టిగా అమలు చేస్తున్నారు.

అత్యవసర వాటికోసం అవస్థలు...

మండలంలోని అన్ని దుకాణాలతో పాలు, పెరుగు, మెడికల్ షాపుల్ని మూసివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్నారులకు నిత్యం అవసరమైన వీటిని అందుబాటులోకి ఉంచాలంటూ సీపీఐ నాయకులు నూతలపాటి కాళిదాసు కోరారు. అధికారులు చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని ఆయా దుకాణాలను ప్రత్యేక సమయాలను కేటాయించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ఆర్వో వరదా సుబ్బారావు

వినుకొండ(నూజెండ్ల): కౌంటింగ్‌లో ఎన్నికల నిబంధనలు పాటించాలని ఆర్వో వరదా సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు, కౌంటింగ్ ఏజెంట్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో సుబ్బారావు మాట్లాడుతూ జూన్ 4వ తేదీన కౌంటింగ్ ప్రక్రియ గురించి ఐదు మండలాల రెవెన్యూ, పోలీసులతో పాటు కౌంటింగ్ ఏజెంట్లకు సలహాలు, సూచనలు చేయడమైంది. ఎన్నికల నియమావళి ప్రకారం ఏజెంట్లు, అధికారులు నడుచుకోవాలని, కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అలజడలు సృష్టించినా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినా బయటకు పంపివేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు మద్యం తాగి కౌంటింగ్ కేంద్రాలకు రాకూడదని, నిబంధనలు పాటించి అధికారులకు సహకరించాలని సూచించారు.

ఇంటి పిట్టగోడపై పడిన పిడుగు

యడ్లపాడు: మండలంలోని ఉన్నవ గ్రామంలో ఓ ఇంటిపై పిడుగు పడింది. గ్రామంలోని సంగం డెయిరీ పాల సేకరణ కేంద్రం వద్ద ఉన్న గల్లా శ్రీనివాసరావు పక్కా ఇంటిపై పిట్టగోడపై ఆదివారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో పిడుగు పడింది. దీంతో గోడ పాక్షికంగా దెబ్బతింది.

నాటు సారా స్వాధీనం

నకరికల్లు: మండలంలోని చేజర్ల గ్రామంలో తరలిస్తున్న నాటు సారాను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పి.రాంబాబు ఆదివారం తెలిపారు. గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.
బాణావత్ రామకృష్ణ నాయక్, నంది నాయక్, బాణావత్ శివానాయక్, బాణావత్ శంకర్‌నాయక్ కలసి నాటుసారా తీసుకెళ్తుండగా.. అదుపులోకి తీసుకునేందుకు గట్టి ప్రయత్నం చేసినట్లు తెలిపారు. వారిలో బాణావత్ రామకృష్ణా నాయక్‌ను అదుపులోకి తీసుకోగా మిగిలిన ముగ్గురు పరారైనట్లు పేర్కొన్నారు. అతని వద్ద ఉన్న 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పకడ్బందీగా 144 సెక్షన్

నకరికల్లు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యం, ఎగ్జిట్ పోల్స్ విడుదల కావడంతో అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. శనివారం నుంచి పోలీసులు గ్రామాల్లో తిరిగి దుకాణాలు, వ్యాపార సంస్థలు మూసివేయించారు. ప్రజలను కూడా రోడ్లపై తిరగనివ్వడం లేదు. దీంతో ప్రధాన రహదారితో పాటు రోడ్లన్నీ బోసి పోతున్నాయి. వాహనాలు కూడా తక్కువగా తిరుగుతుండడంతో కర్ఫ్యూ వాతావరణం తలపిస్తోంది. కరోనా కాలం గుర్తు చేస్తోంది. ఈ సందర్భంగా నకరికల్లు ఎస్ఐ పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు 144 సెక్షన్‌ను కఠినంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ఉల్లాసం.. ఆరోగ్యం



పట్టణంలోని డాక్టర్ పీఎం రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ కోచ్ పర్యవేక్షణలో ఈత నేర్చుకుంటున్న చిన్నారులు

- ఈత కొట్టడం వల్ల ఎన్నో ప్రయోజనాలు
- ఆరోగ్యం పదిలంగా.. ఒత్తిడికి దూరంగా..
- విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం
- నత్తెనపల్లి పట్టణంలో అందుబాటులో స్విమ్మింగ్ పూల్

సత్తెనపల్లి: వేసవిలో ఉష్ణ తాపాన్ని తగ్గించుకోవడానికి కొందరు ఈత కొడుతూ ఉపశమనం పొందుతుంటారు. మరికొందరు సరదాగా ఈత కొట్టడానికి ఇష్టపడుతుంటారు. అయితే ఈత కొట్టడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అంటున్నారు వైద్య నిపుణులు. ముఖ్యంగా ఒత్తిడి నుంచి దూరం కావడానికి, కండరాలు బలోపేతానికి, బరువు తగ్గడానికి ఎంతగానో దోహద పడుతుందని చెబుతున్నారు. రక్త ప్రసరణ బాగా జరిగి గుండె పనితీరును మెరుగు పరుస్తుంది. శరీరాన్ని ఉత్తేజపరచి ఉల్లాసంగా ఉండేందుకు ఉపయోగపడుతుంది. స్విమ్మింగ్‌లో ప్రతిభ కనబరిస్తే స్పోర్ట్స్ కోటాలో విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత ఉంటుంది.

- ఈత శరీరంలో ఉన్న ప్రతి కండరం కదులుతూ ఉత్తేజ పరుస్తుంది. ప్రతి ఒక్క కీలు చక్కగా పనిచేస్తూ ఎలాంటి ఇబ్బందికి గురికాకుండా ఆరోగ్యంగా ఉంటుంది. మైదానాల్లో ఆడే ఆటల కన్నా ఈత కొట్టేటప్పుడు ఎక్కువ క్యాలరీలు ఖర్చు అవుతాయి. ఈత కొట్టే సమయంలో పీల్చిన గాలి ఊపిరితిత్తులు స్వచ్ఛమైన ప్రాణవాయువుగా మార్చి మన శరీర భాగాలకు సరఫరా అయ్యేలా చేస్తుంది. నిత్య జీవితంలో మనం ఉత్సాహంగా పనులు చేయడానికి ఎంతో దోహదపడుతుంది.
- స్విమ్మింగ్ లో ప్రతిభ కనబరిస్తే విద్య, ఉద్యోగాల నియామకాల్లో ప్రాధాన్యం ఉంటుంది. స్విమ్మింగ్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించిన విద్యార్థులకు నీట్, ఇంజినీరింగ్, డిగ్రీ విద్యలో ప్రాధాన్యం ఉంటుంది. ఉద్యోగ నియామకాల్లో జీవో నెంబర్ 74 ప్రకారం రెండు శాతం రిజర్వేషన్ ఉంటుంది.
- వల్ల కీళ్ల నొప్పులు, హృద్రోగ నియంత్రణ, రక్త పోటు, చక్కెర వ్యాధి అదుపులో ఉంచేందుకు ఈత ఒక దివ్య ఔషధంగా పని చేస్తోంది. ఏవైనా కొన్ని శస్త్ర చికిత్సలు జరిగినప్పుడు రిహేబిలిటేషన్‌కు ఈత కొట్టాలని వైద్యులు సూచిస్తారు. ఈత నేర్చుకోవడం వల్ల నీటి ప్రమాదాల నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చు. స్విమ్మింగ్ జీవితాంతం కొనసాగించగల ఆరోగ్యకరమైన చర్య.
- వేసవి తాపం తీర్చుకునేందుకు చల్లటి మార్గం స్విమ్మింగ్. అయితే నిపుణుల పర్యవేక్షణలో ఈత నేర్చుకోవడం అన్ని విధాల శ్రేయస్కరం. పట్టణంలోని గుంటూరు రోడ్డులోని డాక్టర్ పీఎం రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఇటీవల ఈత కొలను (స్విమ్మింగ్ పూల్‌ను)ప్రారంభించారు. దీంతో చిన్నారులు, యువత, మహిళలు, పెద్దలు ఈత నేర్చుకునేందుకు మక్కువ చూపిస్తున్నారు. ఉదయం 6 నుంచి 11.00 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8:30 గంటల వరకు స్విమ్మింగ్ పూల్ నడుస్తుంది. స్విమ్మింగ్ పూల్స్‌లో రోజువారి, నెలవారీ ప్యాకేజీలతో ఆకట్టుకుంటున్నారు. ఇక్కడ రెండు స్విమ్మింగ్ పూల్స్ ఉన్నాయి. పిల్లలకు, పెద్దలకు వేర్వేరుగా కోచ్‌ల పర్యవేక్షణలో స్విమ్మింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఒక్కొక్కరికి గంటకు రూ. 150, నెలవారి ప్యాకేజీ అయితే రూ.2,500 నిర్ణయించారు.

రోజూ స్విమ్మింగ్‌లో శిక్షణ



నాకు ఎప్పటి నుంచో స్విమ్మింగ్ నేర్చుకోవాలని ఆశ ఉంది. కానీ స్థానికంగా స్విమ్మింగ్ పూల్ లేకపోవడంతో నేర్చుకోలేకపోయా. ప్రస్తుతం స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేయడంతో మా నాన్నతో కలిసి రోజు వస్తున్నా. ఈతలో శిక్షణ కూడా పొందుతున్నా.

–షేక్ నిహాస్, 6వ తరగతి, సత్తెనపల్లి

డాక్టర్ చెన్నారెడ్డి హాస్పిటల్ ప్రారంభం

- అందుబాటులోకి జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు
- బోన్ అండ్ బర్త్ సెంటర్, మా ఫెర్టిలిటీ అండ్ ఐవీఎఫ్ సెంటర్ సేవలు



హాస్పిటల్‌ను రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభిస్తున్న డాక్టర్లు గజ్జల, రామలింగారెడ్డి, కారసాని

నరసరావుపేట: గుంటూరురోడ్డులో డాక్టర్ డి.చెన్నారెడ్డి, డాక్టర్ వసంతరాయ దంపతులు అత్యాధునిక వైద్యపరికరాలతో నిర్మించిన బోన్ అండ్ బర్త్ సెంటర్, మా ఫెర్టిలిటీ అండ్ ఐవీఎఫ్ సెంటర్ ఉన్న డాక్టర్ చెన్నారెడ్డి హాస్పిటల్స్‌ను సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి ఆదివారం రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. డాక్టర్ గజ్జల మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మరో అత్యాధునిక హాస్పిటల్ ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. వీటిని పేషెంట్లు వినియోగించుకోవాలని కోరారు. ఎముకలు, వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో పేషెంట్లకు కావాల్సిన జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీతో పాటు అనేక వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. హాస్పిటల్‌లోని పలు విభాగాలను ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) అధ్యక్షులు డాక్టర్ ఏఏవీ రామలింగారెడ్డి, కార్యదర్శి డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ డాక్టర్ల సెల్ ప్రతినిధి డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మసాని కమలాకరరెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. రెడ్‌క్రాసు సొసైటీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కేజే మోహనరెడ్డి, పలువురు డాక్టర్లు సూరా ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ప్రత్యూష, కొండపల్లి వెంకటేశ్వర్లు, ఓరుగంటి శేషిరెడ్డి, పల్లకి వేణుగోపాలరెడ్డి, రామిరెడ్డి వినోద్‌కుమార్, గడ్డం శ్రీకాంత్‌రెడ్డి, జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, షేక్ జహీర్‌అబ్బాస్, షహీన్‌సయ్యద్ పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

కౌంటింగ్ కేంద్రంలో వివాదాలకు దిగితే చర్యలు



కౌంటింగ్ ఏజెంట్లతో మాట్లాడుతున్న ఆర్వో నారదముని

ఆర్వో నారదముని

చిలకలూరిపేట: కౌంటింగ్ కేంద్రంలో ఎలాంటి వివాదాలకు తావు ఇవ్వరాదని, గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని రిటర్నింగ్ అధికారి బి.నారదముని హెచ్చరించారు. చిలకలూరిపేట తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలో గొడవలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. నియోజకవర్గానికి ఒక సీనియర్ పోలీసు అధికారితో పాటు, మఫ్టీలో పోలీసు సిబ్బంది ఉంటారని పేర్కొన్నారు. ఎవరైనా ఏజెంట్లు గొడవకు దిగితే అలాంటి వారిని కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు పంపటం జరుగుతుందని హెచ్చరించారు. నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు రెండు టేబుళ్లు, ఈవీఎంల లెక్కింపునకు 14 టేబుళ్లు వెరసి మొత్తం 16 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు, ఇండిపెండెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లు ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియ కొనసాగేందుకు సహకరించాలని కోరారు.

దారిదోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్

నరసరావుపేట టౌన్: దారి దోపిడీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సిహెచ్.కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. పమిడిపాడు గ్రామానికి చెందిన వల్లెపు శివ తాపీ మేస్త్రీగా పనిచేస్తుంటాడు. పనుల నిమిత్తం బెంగళూరు వెళ్లి గత నెల 20వ తేదీ తెల్లవారు జామున నరసరావుపేటకు రైల్లో వచ్చాడు. స్టేషన్ నుంచి కోట సెంటర్‌కు నడిచి వెళ్తుండగా మార్గమధ్యంలో గాంధీ పార్కు వద్ద గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు కత్తితో బెదిరించి అతని వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్ అపహరించుకు వెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సమీపంలోని చెప్పుల దుకాణం వద్ద లభించిన సీసీ పుటేజ్ అధారంగా నిందితులు కొండలరావుపేటకు చెందిన జాజం సంతోష్ కుమార్, వరవకట్టకు చెందిన షేక్ జమీర్ మీరావలి పాత నేరస్తులుగా గుర్తించారు. దీంతో వారిద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించగా పై నేరాన్ని వారే చేసినట్లు అంగీకరించి దోచుకున్న సొత్తును పోలీసులకు అప్పగించారు. నిందితులిద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.